## 41

# క్రూరమైన ఎత్తిపొడుపు మాటలు

*“ఆ మార్గమున వెళ్లుచుండినవారు తలలూచుచు ... ఆయనను దూషించిరి. ఆలాగే శాస్త్రులును పెద్దలును ప్రధానయాజకులును ... ఆయనతో కూడ సిలువవేయబడిన బందిపోటుదొంగలును ఆలాగే ఆయనను నిందించిరి” (మత్తయి 27:39, 44).*

సిలువ చెంత, మనము నీతిమంతులైన పాపులను, అజ్ఞానులైన పాపులను, సాంఘికమైన పాపులను, మరియు ఘోరాతిఘోరంగా ఖండింపబడిన పాపులను చూచుచున్నాము. ఈ నాలుగు మానవత్వ గుంపులు కూడా సిలువపై వ్రేలాడుచుండిన యేసును ఎత్తిపొడుపు మాటలతో ఎగతాలి చేయుటను మత్తయి, మార్కు మరియు లూకా చిత్రీకరించారు (మత్తయి 27:39-44; మార్కు 15:29-32; లూకా 23:35-37). దారిన వెళ్తూ చూచుచుండిన వీరంతా యేసు సిలువవేయబడవలెనని హఠంచేయుట మాత్రమేగాక, ఆయన సిలువ మరణమును చిత్రహింస నొందుచుండగా ఆయనను పరిహసించారు. అత్యంత మానవీయ దురవస్థలో నుండిన ఆయనను వారు అనాగరికంగా ఎగతాళి చేశారు. సిలువ చుట్టూర ఉండినవారు మరియు కలువరిగిరి దారిలో వెళ్లుచుండినవారు యేసు మన రక్షణ నిమిత్తము అనుభవించుచుండిన వేదనను తీవ్రతరం చేశారు. యేసును సిలువవేయుట ఒక ఎత్తైతే, ఆయన మరణించక మునుపు భయంకరమైన బాధను భరించుచుండగా ఆయనను చూచుచు ఎగతాళిగా నవ్వుట అంతకన్నా ఘోరాతిఘోరమైన ఎత్తైయుండినది.

*మానవ జాతి యొక్క అల్పమైన నమూనాలుగా ఉండిన వీరు ఆయన ప్రవచనములను దూషించారు.* వారు చేయుచుండిన అపహాస్యము ఒక నిందగా చేయబడింది. "ఆ మార్గమున వెళ్లుచుండినవారు తలలూచుచు - 'దేవాలయమును పడగొట్టి మూడు దినములలో కట్టువాడా, నిన్ను నీవే రక్షించుకొనుము నీవు దేవుని కుమారుడవైతే సిలువమీదనుండి దిగుమని' చెప్పుచు ఆయనను దూషించిరి" అని మత్తయి చెప్పుచున్నాడు (మత్తయి 27:39, 40). బహుశ యేసు సిలువవేయబడిన చోటుకు పక్కపక్కనే బాటసారులు పయనించుచుండిన మరొక బాట అందుబాటులో ఉండియుండవచ్చును. ఆయన అక్కడ కూడుకొనిన వారందరి సంభాషణలు ఆయనకు వినబడునంత దగ్గరలోనే ఉండియుండవచ్చును. దారిని వెళ్లుచుండినవారు ఎగతాళిగా వారి తలలూచుచు ఆయన మనస్సును గాయపర్చు మాటలు పలుకుచు వెళ్లు చుండిరి. వారు "మాకు నీ మాటలు జ్ఞాపకమున్నాయి. నీవు చేస్తానని చెప్పిన విషయాలను మేము మర్చిపోలేదు. దేవాలయము పడగొట్టబడినట్లయితే, నీవు దానిని మూడు దినములలోగా తిరిగి కట్టుదువని నీవు చెప్పావు. ఏదిఏమైనా, ఇప్పుడు చూడు నీ పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉన్నదో! కనీసము నిన్ను నీవైనా రక్షించుకోలేని పరిస్థితి నీది, యిక దేవాలయమునేమి కట్టుతావు!" అని పలుకుచుండిరి.

ఔను, అంతకు మునుపు ఆయన తన పరిచర్యలో యేసు వారు చెప్పుచుండిన దాని వంటిదే ఒక ప్రవచనము పలికాడు. వారి మనస్సులు పూర్వాభిప్రాయముతో నిండియుండినవి, గనుక వారు యేసు పలికిన ప్రవచనము యొక్క పరమార్థమును అర్థంచేసికోలేదు. ఆయన పలికిన మాటలను వారు ఆ సందర్భము నుండి వేరుచేసి, అవే మాటలను అధమాధమమైన ఎగతాళిగా ఉపయోగించుచుండిరి. ఆయన చెప్పని దానిని ఆయన చెప్పినట్లు చేయాలని వారు ప్రయత్నము చేయుచు, ఆయన చెప్పుచుండెనని ఊహించుకొనుచుండిన దాని గూర్చి ఎగతాళిగా నవ్వుకొన్నారు.

యేసు దేవాలయమును పరిశుభ్రము చేసిన తరువాత, యూదులు ఆయన యొద్దకు వచ్చి ఆయనకున్న అధికారమును ధ్రువపర్చుటకు ఆయన వారి యెదుటొక గొప్ప సూచక క్రియ

చేయవలెనని అడిగారు. వారు, “నీవు ఈ కార్యములు చేయుచున్నావే; యే సూచక క్రియను మాకు చూపెదవు?” అని ఆయనను అడిగారు (యోహాను 2:18). అందుకు యేసు, “ఈ దేవాలయమును పడగొట్టుడి, మూడు దినములలో దాని లేపుదును” అని సమాధానమిచ్చాడు (యోహాను 2:19). యేసు, తన శరీరమను దేవాలయమును గూర్చి యీ మాట చెప్పాడే, కానీ నిర్మింపబడి యుండిన దేవాలయము గూర్చి కాదని యోహాను చెప్పుచున్నాడు (యోహాను 2:21). ఆయన తన పునరుత్థానమును గూర్చిన ఒక ప్రవచనమును పలుకుచుండెను. యూదులు, నిర్మింపబడియుండిన భౌతిక దేవాలయము గూర్చి తలంచినందువలన, యేసు చెప్పిన విషయమును పూర్తిగా అపార్థంచేసికొన్నారు. ఆయన తన పునరుత్థానము గూర్చి ముందుగా తెలియజెప్పాడు, కానీ వారు దానిని తెలిసికొనలేదు.

శిష్యుడు వాని యజమాని కంటె గొప్పవాడు కాడు. శిష్యుడు కూడ తరుచుగా ఇటువంటి ఎగతాళినే ఎదుర్కొనవచ్చును. యేసే క్రీస్తని ఆయన విశ్వసించుచున్న విషయమై నిదర్శనమును చూపించునప్పుడు, “యేసు ఉద్దేశమేమైయుండెనో నీకు అర్థమవడంలేదు. ఆయన ప్రవచనములు కేవలము ఉత్తుత్తి మాటలే” అని అతనికి చెప్పవచ్చును.

*వారు ఆయన కలిగియుండిన అద్భుతములుచేయు శక్తిని సహితము అపహసించారు.* వారి పరిహాసము ఒక శోధన రూపంలో ఉండింది. “ఆలాగే శాస్త్రులును పెద్దలును ప్రధాన యాజకులును కూడ ఆయనను అపహసించుచు – ‘వీడు ఇతరులను రక్షించెను; తన్నుతాను రక్షించుకొనలేడు’ ” అని వ్రాయబడి యున్న వాక్యములను మనము చదువుదుము (మత్తయి 27:41, 42ఎ).

ప్రధాన యాజకుడు, ముఖ్య యాజకులు, ప్రజల పెద్దలు, మరియు శాస్త్రులు వారు అనుకున్న దానిని సాధించారు. ఆయన సిలువవేయబడవలెనని వారు పట్టుదలగా ప్రకటించారు, గనుక అదే తుదితీర్పుగా ప్రకటించబడింది. యేసు వారి యెదుట సిలువపై వ్రేలాడుచుండెను. “మేము, నెగ్గాలనే మొదలుపెట్టిన పోరాటములో నెగ్గాము” అని వారు వారి మనస్సుల్లో అనుకొని యుండవచ్చును.

అనేక సందర్భములలో, ఆయన కలిగియుండిన అద్భుతకార్యములు చేయు శక్తిని ఆయన బహిరంగముగా ప్రదర్శించాడు. ఆయన చేసిన అద్భుతములను ప్రజలు కళ్లారా చూశారు, వాటిని ఒప్పుకొన్నారు, మరియు వాటి అంతర్భావములను అంగీకరించారు. యూదుల అధికారియైన నీకొదేము సహితము, “బోధకుడా, నీవు దేవునియొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము; దేవుడతనికి తోడైయుంటేనే గాని నీవు చేయుచున్న సూచక క్రియలను ఎవడును చేయలేడు” అని చెప్పాడు (యోహాను 3:2). యేసు చేసిన అద్భుతములు స్వయంవిదితమైనవిగాను, విశ్వసనీయమైనవిగాను, మరియు పొరబడరానివిగాను ఉండెను.

యేసు చేసిన అద్భుతములను ఆయన శత్రువులు కాదనలేకపోయారు, అప్పుడప్పుడు ఆయన కలిగియుండిన శక్తిని వారు దయ్యానికి ఆపాదించారు (మత్తయి 12:24 చూడుము). కానీ ఆయన చేసిన అద్భుతకార్యములు ఎవరైనను కాదనగలిగిన దానికంటె ఎక్కువ స్వయంవిదితమైనవై యుండినవి. ఏదిఏమైనా, అవి వారిని ఆయన దైవత్వము గూర్చి ఒప్పించునట్లు ఆయన శక్తిని అనుమతించమని వారు ధ్రుఢనిశ్చయం చేసికొన్నారు. ఈ తుది నిర్ణయమునకు వచ్చిన తరువాత వారు, “ఔను, వీడు ఇతరులను రక్షించాడు; కానీ ఇప్పుడు చూడండి, వీడు తనను తాను రక్షించుకొనలేడు! ఇతరులను రక్షించగలిగియుండి ఇప్పుడు

ఈ ఉపద్రవము నుండి తనను తానే రక్షించుకొనలేకుండుట అదేమైనా ప్రయోజనకరమైన విషయమేనా? ఈయన ఎటువంటి రాజు? ఈయన శక్తి ఎంత శక్తిహీనమైనదై యున్నది కదా!" అని మనము చెప్పదలచి దానిలో కొంత తెలివి ఉన్నదని అని అనుకొన్నారు.

ఆయన పరిచర్య గూర్చి ప్రదర్శింపబడిన ఈ సత్యమును ప్రక్కకు నెట్టివేస్తూ, వినోదములను చూడవచ్చి సిలువకు సమీపంలో చేరుకొన్న సందర్శకులు వారి తలలూచుచూ, "నీవు దేవుని కుమారుడవైతే సిలువమీదనుండి దిగుము" అని చెప్పుచు ఆయనను అపహసించారు (మత్తయి 27:40బి). సైనికులు సహితము వారి గొంతులు తెరచి శ్రమ నొందుచుండిన క్రీస్తును అవే మాటలతో అపహసించారు. వారు ఆయనను సమీపించి, ఆయనకు చిరకనిచ్చి – "నీవు యూదుల రాజువైతే నిన్ను నీవే రక్షించుకొనుమని" ఆయనను అపహసించారు (లూకా 23:36, 37).

యెరూషలేము పట్టణములో నుండినవారిలో, సిలువవేయబడుటకు యేసు తనను తాను అప్పగించుకొనుచుండిన దానికి గల కారణమును గ్రహించిన వారిలో, బహుశ ఆయన అపొస్తలులు, శిష్యులు మరియు ఇతరులు కొందరు మాత్రమే ఉండియుంటారు. అధికారులు, వారి అజ్ఞానము వలన, ఆయన సిలువ మీది నుండి దిగి రావలెనని కేకలు వేశారు. ఆయన తనను తాను రక్షించుకొనవలెనని వారు పలుకుచుండిన ఎత్తిపొడుపులతో కూడిన సవాలు సిలువ సమీపమున వారికిష్టమైన వెక్కిరింపు కూతయై యుండినది. యేసు తనను తానే రక్షించుకొన్నట్లయితే మానవాళిలోని ఏ ఒక్కరికైనను రక్షణలేదని వారు కొంచెమైనా గ్రహించలేదు. వారు ఆయన రాజైయుండిన విషయాన్ని ద్వేషంతో తిరస్కరించారు. వారి అపహాస్యము పరువునష్టం రూపంలో ఉండినది. "వీడు ఇశ్రాయేలురాజు గదా" అని వారన్నారు (మత్తయి 27:42బి).

*యేసు రాజైయుండినట్లు అంగీకరించాడని వారు తెలిసికొన్నారు.* కానీ యేసు ఇశ్రాయేలును విడిపించుటకు వచ్చిన గొప్ప రాజైయున్నాడు, సర్వశక్తిమంతుడైన రాజు, మెస్సీయాయై యున్నాడను అభిప్రాయము గూర్చి వారు బహిరంగముగా నవ్వుచుండిరి. నిజానికి, "మేము నీయందు విశ్వాసముంచునట్లు నీవు మమ్ములను ఒప్పించుటకు ఇదొక మార్గము. కేవలము నీవు సిలువ మీది నుండి దిగి రావడమే చాలు. నీవు చెప్పినవి మరియు చేసినవాటన్నిటిని మేము (పనికిరాదని) పారవేసాము, కానీ నీవు మా కొరకు ఈ ఒక్క పని చేస్తే, మేము నీయందు విశ్వాసముంచుదుము. కేవలము నీవు సిలువమీదినుండి దిగి రా" అని వారన్నారు.

యేసు వారి యెదుట అద్భుతములు చేశాడు. యేసు ఆయన కుమారుడనియు, ఆయన పాత నిబంధనలోని ప్రవచనములను నెరవేర్చుచున్నాడని తన బోధల ద్వారా ఆయన వారికి రుజువుపర్చాడనియు పరలోకము నుండి తండ్రి సాక్ష్యమిచ్చాడు. అట్లయినప్పటికిని, వారు ఆయన వారికిచ్చిన సమస్త నిదర్శనమును నిరాకరించారు. ఆయనిచ్చిన నిదర్శనము చాలినంత కంటె ఎక్కువైనదై యుండెను, కానీ వారు దానిని నమ్మకుండుటకే తీర్మానించుకొన్నారు. "నీవు సిలువమీదినుండి దిగి వచ్చినట్లయితే, మేము నీయందు విశ్వాసముంచెదము" అని వారు పలికిన పలుకులే ప్రయోజన శూన్యమైనవై యుండెను. ఆయన యిందు విశ్వాసముంచవలెనని వారెన్నడూ ఉద్దేశించలేదు. వారి హృదయాలు శుద్ధియైనవై యుండియుంటే, యేసు అంతకు మునుపు చేసిన అద్భుతములు వారిని ఒప్పించి యుండును. రాజులకు రాజైనవాడు వారి

మధ్య ఉండెను, కానీ వారాయనను తృణీకరించి, సిలువవేసి, ఎగతాళి చేశారు.

*ఆయన దేవునితో కలిగియుండిన వ్యక్తిగత సంబంధమును వెటకారంగా వెక్కిరించారు.* ఈ ఎత్తిపొడుపు మాటలు ఒక ప్రతిపాదన రూపంలో ఉండినవి. వారు, "వాడు దేవునియందు విశ్వాసముంచెను; నేను దేవుని కుమారుడనని చెప్పెను గనుక ఆయనకిష్టుడైతే ఆయన ఇప్పుడు వానిని తప్పించును" అని కేకలు వేశారు (మత్తయి 27:43). బహుశ, ఈ ఎత్తిపొడుపు మాటలు యేసు మనస్సును ఘోరంగా గాయపర్చియుండును. వారు, "ఈయన ఎంతో నీతిమంతుడును, ఎంతో ఆధ్యాత్మికమైనవాడు కదా, ఈయన నిజముగా దేవునికి సన్నిహితముగా ఉన్నవాడైతే, ఆయనను ఈ ఆపదనుండి తప్పించి కాపాడుటకు దేవుడు ఎందుకు రావడము లేదు? ఆయన దేవుని కుమారుడనని చెప్పాడు; మంచిదే, అలాంటప్పుడు, ఈయన తన కుమారుడేనని దేవుడు అంగీకరించి ఈయనను విడిపిస్తాడేమో చూద్దాము. దేవుడు ఈయనను నిజముగా ప్రేమించుచు ఈయన తన సేవకుడని గుర్తించినట్లయితే, ఈయనను విడిపించుటకు దేవుడు తప్పకుండ దిగి వస్తాడు. ఈయనకు సహాయము చేయుటకై దేవుడు దిగి రావడము లేదని ఎవరైనా చెప్పగలరు. ఈయన నిశ్చయంగా దేవుని కుమారుడు కాడు" అని చెప్పుచుండిరి.

యేసు ఒక ప్రక్క మానవునిచేతను మరొక ప్రక్క దేవునిచేతను తృణీకరింపబడ్డాడని సిలువ చెంత నుండినవారిలో అనేకులు ఘోషించారు. ఈయన పాపము ఈయనను కనుగొన్నదని వారు వాదోపవాదములు చేశారు. "ఈయన దేవునితో కూడ నడుచుచున్నవాడైయుండవలెను కదా. ఈయనను సిలువమీద నుండి క్రిందికి దించుటకు దేవుడెందుకు దిగిరావడంలేదు? దేవుడు కూడ ఈయనను విడిచిపెట్టేశాడని మనమంతా చూస్తూనే ఉన్నాము కదా?" అని వారన్నారు.

వారు ఈ విధంగా ఆయనపై అపహాస్యపు అపవాదాలను విసరుచు, ప్రవచనముగా పలుకబడిన ఒక కీర్తనను వారి ప్రధాన చీవాటుగా ఉపయోగించుచుండిరి. "వాడు దేవునియందు విశ్వాసముంచెను; గనుక ఆయనకిష్టుడైతే ఆయన ఇప్పుడు వానిని తప్పించును" అను మాటలు కిర్తనలు 22:8లో నుండి తీసికొనబడినవి. ఈ కీర్తనలోని మొదటి వాక్యమును యేసు మధ్యాహ్నా సమయంలో ఉల్లేఖించి పలికాడు. ఆయన, "నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివి?" అని పలికాడు (కీర్తనలు 22:1ఎ). సిలువ వలన కలుగుచుండిన ఆ బాధలో, దుఃఖములో మరియు విచారములో, దావీదు కీర్తనలు 22లో చిత్రీకరించినట్లు పలికిన ప్రవచనమునకు తగినట్లుగా నిలిచియుండుటకు ఆయన తనను తాను సమాళించుకొన్నాడు; కానీ యూదులు కీర్తనలోని ఆ మాటలను ముళ్ల వలె గుచ్చుకొను ఎగతాళిగా వక్రీకరించారు. లేఖనములు దుర్వినియోగము చేయబడి వారి వ్యంగ్యపూరిత అపహాస్య అంశముగా మార్చబడినవి. ఈ మాటలకు అబద్ధ భాష్యము చెప్పుచూ, అవిశ్వాసులైన మతసంబంధ నాయకులు ఆ మాటలను దేవదూషణగా మార్చారు.

ఔను, వారి దురంతము మరియు అనుభూతిశూన్యము భయంకరమైన లోతులకు చేరుకొన్న దుర్మార్గుల ఎత్తిపొడుపుమాటలతో నిండియుండిన వాతావరణంలో యేసు సిలువ మీద మరణించాడు. వారు ఆయన ప్రవచనములను, అద్భుతములు చేయగల ఆయన శక్తిని, దైవికమైన రాజరిక స్థానమును, మరియు ఆయన దేవునితో కలిగియుండిన వ్యక్తిగత సంబంధమును ద్వేషముతో తిరస్కరించారు. మనము యేసుతో కూడ నడుచునప్పుడు,

మనము కూడ ముళ్ల వలె గుచ్చుకొను ఇటువంటి విమర్శలను ఎదుర్కొనవచ్చును. మనము యేసును ఉల్లేఖించి పేర్కొన్నప్పుడు, ఆయన చెప్పిన ప్రవచనముల గూర్చి ప్రజలు హేళనగా నవ్వుట మనము గమనించవచ్చును. ఆయన దైవత్వము యొక్క అద్భుతకరమైన నిదర్శనమును మనము చర్చించినప్పుడు, మనము వెక్కిరింపబడవచ్చును. మనము ఆయనను రాజుగా గౌరవించినప్పుడు, మనము తిరస్కారపూర్వకమైన అపహాస్యమును ఎదుర్కొనవచ్చును. ఆయన దేవుని కుమారుడని మనము బోధించినప్పుడు, మనము మూర్ఖులమని లెక్కింపబడవచ్చును. ఇటువంటి సంఘటనలు సంభవించినప్పుడు, మనము వాటన్నిటిని యేసు ఎదుర్కొన్నట్లు – మనలను అపహాస్యము చేయు వారి నిమిత్తము మనము మన జీవితములను అర్పించుకొంటూ ఎగతాళిని ప్రశాంతంగా భరించుచు ఎదుర్కొనవలెను.

❖◆❖◆❖

*"నేను నరుడను కాను నేను పురుగును, నరులచేత నిందింపబడినవాడను ప్రజలచేత తృణీకరింపబడిన వాడను. నన్ను చూచువారందరు పెదవులు విరిచి, తల ఆడించుచు నన్ను అపహసించుచున్నారు; యెహోవా మీద నీ భారము మోపుము; ఆయనవానిని విడిపించునేమో; వాడు ఆయనకు ఇష్టుడు గదా, ఆయన వానిని తప్పించునేమో" (కీర్తనలు 22:6–8).*

*"వృషభములు అనేకములు నన్ను చుట్టుకొని యున్నవి; బాషానుదేశపు బలమైన వృషభములు నన్ను ఆవరించియున్నవి. చీల్చుచును గర్జించుచునుండు సింహమువలె వారు నోళ్లు తెరచుచున్నారు" (కీర్తనలు 22:12, 13).*